# ఆరోవాని కథ

అనుకోకుండా ఆ ముసలమ్మకి నే నిచ్చిన జవాబుకి నాలో నాకే చటుక్కున నవ్వొచ్చింది. ఆనాటి అనుభవంకూడా గబుక్కున జ్ఞాపకంవచ్చి మనసు కలుక్కుమంది.

ఏమీలేదు. ఆరోజు సాయంత్రంకూడా మామూలుగా డాబామీద కూచున్నాను. ఇప్పుడుండి యింకొక గడియకు పోతాయనే సంగతి ముందుగానే తెలిసినా మేఘతూలికలమీద మాత్రం నా కింకా మోహం పోలేదు; అలా చూస్తూ కూచుంటాను. పక్కింటికి వచ్చిన పెద్దమనిషితో యింటాయన మొరపెట్టుకుంటున్నాడు. 'మూడుముళ్లూ వేసిననాడే ఐదుప్రాణాలూ పోయాయని గ్రహించలేక పోయాను. గ్రహించగలిగే సమయం వచ్చేసరికి బ్రహ్మరాక్షసి ఒక్కర్తేగాదు, దాన్ని సమర్థించడానికి ఆరుగురు పిల్లపిశాచాలుకూడా పోగయ్యాయి. బావగారూ, నాకు సన్యాసం యిప్పించండి' అన్నాడు ఆయన.

ఎక్కడవిందో యీ మాట, యిల్లాలుకూడా పరిగెత్తుకొచ్చింది.

'విన్నారా అన్నయ్యా... రాసి రంపాన పెడుతున్నదేగాక యింకా పితూరీలు కూడానా? ఆ పదిహేనేళ్ళు అక్కడ ఏం అనుభవించానో అంతే... ఎక్కడ దొరకడో అని పదివేలిచ్చి ఖరీదుచేశాడు మా నాన్న ఈ యమధర్మరాజుని...'

ఇంక నేను వినలేదు. మాకివేం కొత్తకాదు. ఎప్పుడూ జేబులు గలగలలాడే భాగ్యవంతుడాయన. తళతళలాడే చీరలు తప్ప కట్టని సంపన్నురాలావిడ. కలకలలాడే పిల్లలు గల సంసారం అది. వెలవెలబోతూ ఉందంటే ఏమిటికారణం? నేను అట్నించి యిటు పచారుచేస్తూ వచ్చేసరికి ఆ పెద్దమనిషి లెక్చరు చెవినబడ్డది. అది నన్ను ఆకర్షించి నిలబెట్టింది.

'మీ దృక్పథాలు మారాలి. ఒకరిమీద మరొకరికిఉన్న అభిప్రాయాలు మారాలి. మీ ఆయన గురించి నువ్వు 'కష్టపడి చెమటోడ్చి డబ్బు సంపాదించి యింటిని పోషించే యజమాని ఆయన. నా పిల్లలకు తండ్రి. నాకు సర్వదా పూజ్యులు' అనుకోవాలి. మీ ఆవిడ గురించి మీరు 'నాకూ నా పిల్లలకూ అమృతం ఒండి పెట్టే యిల్లాలు యిది. వా వంశాంకురాల్ని అందించిన భాగ్యశాలిని. ఈమె నాకు సదా గౌరవనీయురాలు' అనుకోవాలి. పరస్పరం సానుభూతి చూపించుకోవాలి. పిల్లల కోసమైనా మీరు కలిసిఉండాలి. తప్పదు!'

అవసరాల రామకృష్ణారావు

ఇక వినలేకపోయాను. నా మనసు కదిలిపోయింది.

కాపురానికి వచ్చిన మొదటేడు ఓ నాడు తెలిసినవాళ్ళెవరో పనసపండు తెచ్చి యిచ్చారు. సాయంకాలం ఆఫీసునుంచి ఆయనవచ్చి బూట్లు విప్పుకుంటున్నారు. పిల్లాణ్ణి ఎత్తుకున్నట్టు ఆ పెద్దపనసపండుని రెండు చేతుల్లోనూ పట్టుకుని పైన తువ్వాలు కనబడకుండా మూసి ఆయన దగ్గరకివచ్చి 'అందుకోండి' అన్నాను. ఆయన తువ్వాలు తీసేసి పక్కున నవ్వేరు.

'కుర్రాడు బలంగానే ఉన్నాడుగాని రంగేం అంతబాగుందీ? రంగుమాటకేంలే పోనీ ఎలాగేనా భరించొచ్చుగాని శరీరమేం మరీ అంత మృదువుగాఉందీ?' అన్నారు. ఇద్దరం నవ్వుకున్నాం.

'జెయిల్లోఉన్నా, ఏటా పిల్లల్ని దక్కనివ్వరని తెలిసినా, ఎనిమిది పురుళ్ళుపోసుకోడానికి నువ్వేం దేవకీదేవివికాదుగా! అయినా ఇప్పట్లో తొందరేమొచ్చిందిలే' అన్నారు. మళ్ళీ ... 'ఇప్పట్లో తొందరేమొచ్చిందిలే' అన్నారు. 'ఒద్దులే' అనలేదు. ఆయనకు కావాలి..అవును, నాకు తెలుసు.

వారానికోసారి తలంటేటప్పుడు ఆయన నాకు పసిపిల్లవాడైపోతారు. ఏదైనా కాస్త ఒంట్లో వెచ్చగా ఉంటే నాచేత మందులు మిగించేటప్పుడు ఆయనకి నేను అతిచిన్నదాన్ని ఐపోతాను. అమ్మదగ్గిర్నుంచి ఉత్తరం రాలేదన్నప్పుడు నా మొహంలో ఆయనకీ, అతిగా అలసిపోయి పనిచేసినప్పుడు ఆయన మోహంలో నాకూ అన్నెం పున్నెం తెలియని చిన్న చిన్న పిల్లలు కళ్ళగడతారు. కాని మా కిద్దరికీ కలిపి అమ్మా నాన్నా అనేవాళ్ళు కావాలి. అప్పటికప్పుడు నిలుచున్న పళంగా పరిగెత్తుకొస్తారు. 'శారదా ఆకలి' అనుకుంటూ. ఓ వేళా పాళా ఉండదు. అయిదు నిమిషాలు మనిషిని నిలబడనివ్వరు. కొబ్బరికాయ కొట్టనివ్వడానికేనా వ్యవధియివ్వరు. ఇన్ని అటుకులు ఏ పెరుగులోనేనా నాననియ్యడానికేనా టైం యివ్వరు. ఏ కందిపప్పో గుబుకూ గుబుకూ బొక్కుతారు. చేతులేనా శుభ్రంగా కడుక్కోరు. ఇన్ని మంచినీళ్ళు గడ గడ తాగి నాపమిటిచెంగుకు మూతి తుడుచుకుంటారు.


'ఇదేం మనిషమ్మా' చిన్న పిల్లలకంటె అన్యాయం!' అనేభావం నాలో కలుగుతూనే నా మనసు ద్రవీభూతమైపోతుంది.

మాకు పిల్లలు కావాలి.

ఆయన అన్నీ తెలిసినవారిలా ఓసారి స్నేహితుడితో అంటూఉంటే విన్నాను.

'మూడేళ్ళపాటు మాకేం తొందరాలేదురా...తర్వాతేమో మొగపిల్లవాడు. తరవాత నాలుగేళ్ళు యింటర్వెల్. అప్పుడు ఓ ఆడపిల్ల...అంతే, బంద్'

ఆయన జోస్యం అక్షరాలా అబద్ధమైంది?




"దొంగతనం జరిగిందా ? దొంగ దొరికాడా ? లేదూ ? అయితే మీ రెందుకొచ్చారూ ?"

నేను కాపరానికి వచ్చి పన్నెండేళ్ళు అయింది.

'సరిగ్గా మనం పడుకునే వేళకే. లేచి ఏడుస్తాడేమిటి కోతివెధవా'

'మా బాబు ఊరుకోవే, మా నాన్న ఊరుకోవే ... నిన్ను నాన్నగారు వెక్కిరించారాఅమ్మా, ఎండలో నిలబెట్టి వేడి వేడి నీళ్ళుపోద్దాం ... అలాగేనా ?'

'గంటనించి నీ కోసం వెతుక్కుచస్తున్నాను, ఈ గంగాళంలో కూచున్నావా. భలే వాడివిరా !'

'అబ్బబ్బబ్బ...గుక్కతిప్పుకోకుండా ఎందుకురా ఆ ఏడుపూ..ఎందుకూ అంటే చెప్పలేవ్. ఇక నేనెలా చచ్చేదిరా ? ఊరుకుంటావా, పళ్ళురాలకొట్టమన్నావా ?'

'ఇంత అల్లరివాడివి యెక్కడ్నుంచి వచ్చావ్‌రా ... కొత్తగాతెచ్చిన చాకలి మడతల మధ్య తప్ప పావనం చెయ్యావాయె,'

ఇలాంటి మాటలు నిర్భాగ్యులమైన మా యింట్లో వినిపించలేదు.

'చీచీ ఛీ'లూ 'దోబూచీ'లూ నా చేతుల లోకి రాలేదు. నా జీవితానికి పరిపూర్ణత లేదు! మాగూట్లో చిలక లేదు, మాయింట్లో మొలక లేదు !

'పిల్లలకోసమైనా మీరు కలిసిఉండాలి

తప్పదు' అన్నారు ఆ రోజు పక్కింటి పెద్దమనిషి.

'పిల్లలు లేకపోయినా మేం కలిసే ఉన్నాం. కలిగిలేకపోయినా కలిసే ఉన్నాం...ఇది యిలా నిలబడుతుందా?'

నిజానికి నాకా సందేహం రావడానికి ఆయన ఆవగింజంతయినా అవకాశం యివ్వలేదు. నేనే ఏవేవో కల్పించుకుని మరింత కృంగి పోయాను.

* * *

ఏవో తణికీలకని ఆ ర్నెల్ల పాటు ఆయన్ని తాత్కాలికంగా బదిలీచేసినప్పుడు మేం యీ ఊరు వచ్చిన కొత్తలోమాట—

సామాన్లన్నీ సర్దుకుంటున్నాను. ముసిలావిడవచ్చి కూచుంది. ఆవిడ ఆ యిల్లు గల ఆవిడ.

'అయితే మీ ఆయనకి ఏం ఉద్యోగమన్నావ్?'

చెప్పేను.

'ఎంతిస్తారన్నావ్?'

చెప్పేను.

'మీ యింటి పేరుఏమిటీ అన్నావ్?'

చెప్పేను.

'మీ అబ్బాయికి ఎన్నో ఏడనీ అన్నావ్?'

చెప్పలేక పోయాను. ఈ పుణ్యాత్మురాలు నాలో ఏంచూసి పిల్లలుగల తల్లి అనుకుందో నాకు తెలీదు. నా మొహం దించుకు పోయింది.

'అయితే పిల్లాణ్ణి మీ బంట్రోతు ఎత్తుకుని రావటంలేదూ, మీ ఊళ్ళో వదిలేసి వచ్చావా? ఏం చిత్రమే నా తల్లీ... నిన్నొదిలి ఉంటాడూ?'

'ఊఁ' అన్నాననుకుంటాను—ఏమనాలో తెలీక.

'అయినా, మొగాడు ఆయనికి లేకపోతే నువ్వేలా ఒదిలిపెట్టగలిగావే? ఎంత మీ అమ్మ దగ్గిర చనువైతేమాత్రం అంత గుంట నా గమ్మ నిద్రలో లేచి ఏడుస్తే... అయిదోఏదేనా వెళ్ళ లేదు కాబోలు. అవునా?...ఆ ఊర్నించి ఈ ఊరు కసిగందునొదిలి లేచి చక్కా వచ్చారా, ఏం నాగరీకమ్రా' అవును... ఆ రాత్రి నిద్రలో లేచి ఏడిచింది నేనే... మరీ అయిదేళ్ళబట్టి ఆ మధురమూర్తి నాలో పుట్టి పెరుగుతోంది...ఈ పాటికి బోడిపలక బుఱ్ఱమీద బోర్లించుకుని బడి కెళ్ళవలసిన వయసు మరి...!

* * *

ఒకరిలో అసత్యభావాన్ని పెంచి ఆనందించే చిలిపితనం నాకు లేకపోయినా ముసలమ్మగారు నన్ను మారాడనియ్యలేదు, నా మనసులో మారాము నన్నిక మాటాడనియ్యలేదు. అదలా ఉంచి కొత్త అవసరం కూడా వచ్చి పడింది.

ఓ సారి ముసలమ్మగారు భర్తతో అంటోంది :

'మళ్ళీ మీ చెల్లెలికూతురూ ఉంది... అది పదేళ్ళు కాపురంచేసినా ఒకపే

పాతికేళ్ళు కాపురంచేసినా ఒకటే...శుద్ధ గొడ్డుమోతు... పొద్దుట లేచి దాని మొహం చూస్తే పంచ మహాపాతకాలూ, అష్టాదశ దరిద్రాలూను. మనయింట్లో కొత్తగా దిగినవాళ్ళను చూడరాదూ చిలకా గోరింకల్లా ఎంత బాగున్నారోనూ...మళ్ళీ సంతానానికేమైనా లోటా; చక్కగా ఒక్కడే ఒక్కడు కొడుకూ..' నా గుండెలు దడదడ కొట్టుకున్నాయి. 'ఇదేమిటి ?' అన్నారు ఆయన ఆశ్చర్యపోతూ...

'ఏం చెయ్యమన్నారు ? మనవాళ్ళకి మాతృత్వానికి నోచుకోని స్త్రీని చూస్తే సానుభూతి లేదు. అందులో ఈ వైపు వాళ్ళకి పిల్లలు లేని వాళ్ళంటే మరీ చులకన. నేను స్వయంగా చెప్పిందికాదు, వాళ్ళు సృష్టించుకున్నది—మనం కాదనడం దేనికి ? ఇదో కాలక్షేపం, కానియ్యండి' అన్నాను.

ఇంటివారి ముసలావిడతో పాటు ముసలాయనా ఆయన పిల్లలూ, మూడో పురిటికని తీసుకు వచ్చిన ఆయన రెండో కూతురు యిందరూ 'మా అబ్బాయి'



ఊసే ఎత్తి నాకు ఏమాత్రం మనశ్శాంతి లేకుండా చెయ్యడం ప్రారంభించారు.

'ఈ ఆరునెల్లకీ మళ్ళీ తీసుకురావడం ఎందుకని వదిలేసి చక్కా వచ్చింది కాబోలు...ఇనప్పెట్టి అనుకుందో ఇత్తడి గంగాళం అనుకుందో...నేనయితే ఆరు గడియలైనా విడిచిపెట్టి ఉండలేను బాబూ...'

అవునుమరి...ప్రతిజాతికీ సాంప్రదాయం అంటూ ఉంటుంది. కట్టుకున్న భార్యలో కన్నతల్లి కాళిని సాక్షాత్కరింపజేసుకున్న పరమహంసల భారతజాతి మనది. ఇందులో తల్లిదీ పిల్లదీ ఒకే ప్రాణం. భౌతికానందమే పరమావధి కాదు. తల్లిని కొడుకు కలుసుకోడానికి ముందుగా పెర్మిషను పొందడాలూ ఎంగేజిమెంట్సు ఫిక్సు చేసుకొనడాలూ అవసరం లేని మధుర మమతల మానవత మనది. ఇందులో పదేళ్ళపిల్లాడు తీర్థంలోకి వెళ్ళినా తప్పిపోతాడేమో అని తల్లికూడా చెయ్యిపట్టుకుని నడిపిస్తుంది. ఇరవై ఏళ్ళ కొడుకైనా రైల్లో కిటికీ దగ్గిర కూచుంటే పడిపోతాడేమో అని అమ్మ బెంగెట్టుకుంటుంది. మనవల్నెత్తిన కొడుకునయినా కోడలు సరిగ్గా చూడడంలేదని తల్లి మిగిలిన రెండుపళ్ళూ నూరుతుంది. 'అమ్మలగన్న యమ్మ'లను గౌరవించే జాతిమనది. చందనబొమ్మలకి పాలివ్వడం మన ఆడపిల్లలకి అచ్చటా ముచ్చటాను. 'నేనయితే ఆరు గడియలేనా విడిచిపెట్టి ఉండలేను బాబూ' అంది ఆవిడ. నిజమే. నేనూ ఉండలేక పోతున్నాను. 'అభావం' అనే ఆభావం విడిచి ఈ ఊరొచ్చాక మరీ నిలబడలేక పోతున్నాను. పొద్దుట నేనూ ఆయనా కలసి భోంచేశాక ఆయన వెళ్ళేక నాకు నిజంగా పని అంటూ ఉంటే ఒక అరగంట. తర్వాత చీకటిపడి ఆయన వచ్చేదాకా అదే ఆలోచన...ఎంత సేపూ 'వాడి' మీదే దృష్టి. ఈకాళ్ళమీద వాడ్ని 'చిచ్చి' కొట్టాలనీ, ఈ చేత్తో వాడికి చుక్క పెట్టాలనీ, గుండెలకు హత్తుకోవాలనీ ముద్దులిచ్చి పుచ్చుకోవాలనీ... ఈ కోరికలకు అంతులేదు.....ఇదంతా భ్రమ అని తెలిశాక ఈ హృదయపు కోతలకు అంతులేదు. లాభంలేదని తెలిసినా శోకం మానదు మానవుని మనుసు...ఆయన మొగవారు...కనీసం శరీరమైనా అలసిపోడానికి అవకాశముంది...నాకు అదీలేదు...నేను మరచినా ఇంటివాళ్ళు మరవనివ్వరు.

ఇంటాయన అవాళ మా యింటాయన్ని కేకేశారు.

'చూడు బాబూ, పిల్ల ఈ రెణ్ణెల్లకే బొత్తిగా చిక్కిపోయింది. కని పెంచిన వాళ్ళకి తప్ప కనిపించేదా కడుపుతీపి? మూడోఏట కాన్వెంటులో వెయ్యడానికి మనమేం దొరలమూ దొరసాన్లంకాదుగా! పిల్లాడు బియ్యే క్లాసులో ఉన్నాడనీ, చదువుపోతుందనీనా అక్కడ వదిలి

వచ్చినట్టు ? — నిన్ను కాదనలేక అప్పటి కేదో అవునందిగాని — పంచప్రాణాల్నీ అక్కడ వదిలి బతగ్గలదుటయ్యా ? ఎంత చదువుకుంటేమాత్రం కన్నవాళ్ళని ప్రాజ్ఞుల్నీ ప్రయోజకుల్నీ చెయ్యడంకన్న ఆడజన్మకి సార్థకం ఏముంది గనక ? నివ్వింక వెనుదియ్యకు...'

ముసిలావిడ అందుకుంది.

'అవును బాబూ, అలా తెల్లబోతావేం? పిల్ల గుంభనం కలది గనక పైకి మాట్లాడదు గాని లోలోపల ఎంత జీర్ణించుకోలేక కుళ్ళిపోతుందో నీకేం తెలుసు ? రెండ్రోజులు శలవుపెట్టి పిల్లాణ్ణి తీసుకొస్తావా, మీ తాతగార్ని వెళ్ళిరమ్మన్నావా, ఏదో తేల్చెయ్...'

విషాదానికీ వినోదానికీ యింత దగ్గిర చుట్టరిక ముందని నాకు తెలీదు. తెల్లబోయి లోపలికివస్తున్న ఆయన మొహంచూసి ఆగలేక ఆయన గుండెల్లో నా మొహాన్ని దాచుకుని వెక్కివెక్కి ఏడ్చేశాను. నన్నేవిధంగానూ ఆయన ఓదార్చేస్థితిలోలేరని కూడా నాకు తెలుసు. అప్రస్తుతమయినా, సామ్యంకాకపోయినా నేను బియ్యేలో చదివిన టెన్నిసన్ మహాకవి కథాకావ్యం చప్పున స్ఫురణకిరాక మానలేదు.

ఓ అభాగ్యురాలిభర్త యుద్ధంలో ప్రాణాలు కోల్పోతే ఆ కబురు ఆవిడకి చెప్పేరుట. ఆవిడ ఏమాత్రం ఏడవలేదు. అలా అచేతనంగా పిచ్చిచూపులు చూస్తూ కూచుంది. ఆవిడమొహంచూస్తే అందరికీ భయంవేసింది.

'ఈ దుఃఖం ఇలా ఉండిపోతే ఈవిడ హృదయం బ్రద్దలయిపోతుంది. భోరున ఒకసారి ఏడ్చేస్తేగాని యీవిడ బతకదు' అన్నారంతా. ఆవిడకు కన్నీళ్లు తెప్పించడం ఎలాగ ? చచ్చిపోయిన అతని రూపాన్ని ఆవిడకు చూపించారు. ఆవిడ కదలలేదు.

గుణగణాల్ని ఆవిడకు వర్ణించారు. ఆమె మెదలలేదు.

'ఇక ఈవిడా చచ్చిపోతుంది తప్పదు' అనుకున్నారంతా. అనుభవంతో తలపండిన ఒకావిడ ముందుకువచ్చింది. ఆవిడ కొడుకుని చేతులకి అందించింది. ఆవిడ కళ్లదించి ఒళ్లో కొడుకుని చూసుకుంది.

'అయ్యో, నిన్ను దిక్కులేనివాణ్ణిచేసి పోయారా అమ్మా మీ నాన్న !' అంటూ ఒక్కసారి గొల్లుమందిట ?

కొంతసేపు అయాక ఆయన నాదగ్గిరకొచ్చారు.

'ఇంట్లోవాళ్ళతోపాటు నీకూ మతిపోయిందా శారదా ? లేనిపోని సృష్టించుకుని మనతోపాటు వాళ్లూ ఊఁ వెర్రెత్తిపోడం దేనికి ? వెళ్ళి నిజం చెప్పేస్తే పోలేఁ ?'

'అవును... లేదనీ లేడనీ వాళ్ళకు చెప్పగలరు. ఏళ్ళతరబడి నామనసులో

గూడు కట్టుకుంటున్న కోరికకి మీరేం సమాధానం చెప్పగలరు?'


అసలు మేం ఎప్పుడూ ఎక్కువగా మాట్లాడుకోం. అలాంటిది ఆ రోజు తన తొడమీద నాబుర్ర పెట్టుకుని కళ్ళల్లోకి చూస్తూండగా నన్నేదోవిధంగా అనునయింప జేద్దామని ఆయనచేసిన ప్రసంగం, పడిన ప్రయాసాచూసి కృతజ్ఞతతో నిండిపోడం తప్ప నా మనస్సు ఏం ప్రతిఫలం యివ్వగలదు?

'చూడు శారదా, ఇలా ఆలోచించుకుని పోతూంటే ఆఖరికి పిచ్చెత్తిపోడం తప్ప నీకు మార్గంలేదు. చదువుకున్న దానివీ పదిమందికి చెప్పగలదానివీ ఏదో లేనిదానికోసం యిలా కృశించిపోడం ఏమైనా బాగుందా? ఏటా పిల్లలు పుట్టి, దక్కనివాళ్ళున్నారు, పుట్టిన పిల్లల్ని పెంచే ఆర్థిక స్తోమత లేక ఆత్మహత్యలు చేసుకునేవాళ్ళున్నారు, పుట్టి ఎదిగి అందుకుని ఆదుకునే సమయానికి పిల్లలు పోయిన వాళ్ళున్నారు. మనకంటె వెయ్యి రెట్లు నిర్భాగ్యులైన వాళ్ళున్నారు. ఒక నష్టంతోపాటు ఒక లాభంకూడా తప్పకుండా ఉంటుంది. పన్నెండేళ్ళనాడు పెళ్ళి పీటలమీద ఎలా ఉన్నావో యిప్పుడూ నువ్వు అలాగే ఉన్నావు. పిల్లలమీద పంచే మనప్రేమ పరస్పరం మళ్ళీ మనకే దక్కింది. అదిగాక పిల్లలుగల వాళ్ళకి వాళ్ళే పిల్లలు, లేనివాళ్ళకి లోకమంతా పిల్లలు... అదీగాక...'

ఆయనలా చెప్పుకుపోతూంటే, నా పరిస్థితిని సమర్థిస్తూంటే మొదట ఆశ్చర్యం తరవాత కోపమూ కూడా నాకు కలగసాగేయి. డబ్బుసంపాదించడమే సార్థక్యంగా భావించే మామూలు మొగాడిలా ఆయన నాకు కనిపించారు. ఎప్పట్లా ఆయన నన్ను చూసినా నేనాయన్నిమాత్రం చూడలేకపోయాను— నాకు కావలసింది వేరు. నాకు కావలసింది! ఆడదిమాత్రమే నోచుకునే అమూల్యమైన వరం. మొగాడు, ఆయనకది లేకపోతేమాత్రం ఏం? ప్రకృతి అంతా స్త్రీ స్వరూపమనీ భగవంతుడొక్కడే పురుషుడనీ ఆయన కాక్షణంలో తోచలేదు కాబోలు!

'నాకేం చెప్పక్కర్లేదు, వెళ్ళండవతలికి' అన్నాను ఆయన్ని చేత్తో అవతలకి నెట్టుతూ. కొంతసేపటికి మళ్ళీ వచ్చారు.

'ఈ యింటివాళ్ళకి అక్కర్లేని ఊసంటూలేదు. వాళ్ళ ఏడుపేదో వాళ్ళు ఏడవరాదూ...నేనలా వెళ్ళేసరికి 'పిల్లాడెవరిపోలిక అయిఉంటాడంటారు?' అని వాదించుకుని బుర్రలు కొట్టుకుంటున్నారు. ఈ పదిహేనురోజుల అద్దె వాళ్ళ మొహాన పారేసి రేపే యిల్లుమారిపోదాం...అక్కడితోగాని నీబుర్ర బాగుపడదు' అన్నారు.



పక్కింటి లావుపాటి పిన్నిగారు బాబుకి ఒక బత్తాయిపండు ఇచ్చింది.
తల్లి :- "పండుతీసుకుని అలా ఊరుకుంటావేమిట్రా ? ఇప్పుడు ఏమనాలి."
బాబు :- "వాలవండి."

---

'ఇల్లు మారితే బుర్రమారుతుందా' అన్నాను వెంటనే.

'లేనిదాన్ని పట్టుకొచ్చుకుంటావ్... ఎవర్నేనా ఓ చక్కనిపిల్లాణ్ణి తెచ్చి పెంచుకుందామన్నా నీకు పనికిరాకపోయె... నీతో ఎంతకని చావను ?' ఈ పెంచుకోడంమాట ఆయన చాలాసార్లు సూచించారు. ఎందుకనో నేనెప్పుడూ ఒప్పుకోలేదు. ఈసారిమాత్రం 'ఏం, అలాచేస్తే ఏం ?' అని ప్రశ్నించాను. ఈ మనసును మరలించడానికి ఒకరూపం, ఈ ప్రేమను వర్షింపచెయ్యడానికి ఒకసీమ, కనీసం ఆయనకోసమైనా బతకడానికి ఒకశ్వాస- ఏదైతేనేం ? 'మీయిష్టం, ఆలోచించండి' అన్నాను......ఆయన 'నిజమేనా ?' అన్నట్టు ఆశగా నావైపు చూశారు.

ఒక చక్కని త్యాగరాజకృతిఉంది 'ఏమిసొగసు...ఏమి మనసు...' అని. అంతవరకు సామాన్యంగానే ఉంది' ఆ తరవాత ముక్కలోనే ఉంది ఎక్కడ లేని అందమూను. 'ఏమి సొగసు, ఏమి మనసు, ఏమి దినుసు నీది రామా!' అని. భగవంతుడు దేనితో చేయబడ్డాడో ఆ 'దినుసు', ఆ 'మెటీరియల్' ఏమిటీ అని ప్రశ్నించడం నాకు చాలా నచ్చింది. ఆ అనిర్వచనీయమైన బ్రహ్మ పదార్థాన్ని సాక్షాత్కరింప జేసుకున్నప్పుడు ఆ మహాభక్తుడు త్యాగరాజు మొహం ఎలా ఉందో నాకు తెలీదు. కాని అద్దంలో మరింత గుండ్రనౌతున్న నా శరీరాన్ని చూసుకుంటున్నప్పుడు మాత్రం నామసు పరవశించిపోయింది. భ్రమరకీటక న్యాయంగా పదేపదే కోరింది లభించడం కంటె వేరే వరమేముంది గనక? ఇన్నాళ్లు ఇంతగా పరితపించకపోతే నా స్థానంలో ఔన్నత్యాన్ని గుర్తించడానికిగాని నా బాధ్యతని అర్థం చేసుకోడానికిగాని వీలే లేకపోనేమో! ఇంత వెర్రిగా నా మనసులో ఆ కోరిక గడబిడ చెయ్యకపోతే దీవనలందుకోకపోయే దాన్నేమో!

నీరసంగాఉందనీ, వికారం భరించలేకుండా ఉన్నాననీ చెప్పినమీదట ముసిలావిడ నన్ను ఆసుపత్రికి తీసుకెళ్ళింది.

'ఈసారి మహాలక్ష్మిని ఎత్తుకురా! ఈసారిమాత్రం నీకు పుణ్యం ఉంటుంది, బిడ్డను అక్కడా యిక్కడా ఉంచి మమ్మల్ని చంపకుతల్లీ' అంది.

ఎక్కిన జట్కాగుర్రంకంటె ఎక్కువ వేగంతో ఇంట్లోవచ్చి పడ్డాను ఆయన పాదాలమీద పడదామని. గుమ్మంలోనే ఆయన నన్ను పట్టుకున్నారు.

'అమ్మయ్య, యివాళతో నీ గొడవ వదిలిపోయిందిబాబూ.....మనవాళ్ళేట, పాపం బొత్తిగా లేనివాళ్ళుట, పిల్లాడు చిలకలా ఉన్నాడు. ఇచ్చేస్తానన్నారు.'

'వీళ్ళ పిల్లల్నీ, వాళ్ళ పిల్లల్నీ పెంచుకోవలసిన అవసరం ఇంకేముందిలెండి?'

'అంటే?'

నేను చెప్పలేకపోయాను. మా ఆడవాళ్ళు చెప్పలేరు కూడా. గడుసరులైన మొగాళ్ళకి చెప్పక్కర్లేదు కూడా!

